క్లుప్తంగా

పంట నష్టపరిహారం చెక్కుల పంపిణీ



రైతులకు చెక్కులు అందజేస్తున్న రేంజ్ అధికారి ఎంఏ ఖాన్

వెలుగోడు: వన్యప్రాణుల కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం చెక్కులను అటవీ అధికారులు అందజేశారు. సోమవారం స్థానిక ఫారెస్ట్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కొత్తరామాపురం, బానుముక్కల గ్రామాలకు చెందిన 7 మంది రైతులకు రూ.44,450 విలువ చేసే చెక్కులను ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎంఏ ఖాన్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. వన్యప్రాణులపై ఎవరూ దాడులు చేయకూడదన్నారు. నష్టపోయిన రైతులను అటవీ శాఖ ఆదుకుంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓ వి.శివనాగయ్య, పి.శ్రీనివాసులు, ఎఫ్‌బీఓ టి. వెంకటేశ్వర్లు, ఏబీఓ బి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార కిట్ల పంపిణీ


పౌష్టికాహార కిట్లను పంపిణీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు

ఆత్మకూరు: పట్టణంలోని ఆరోగ్య కేంద్రంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా క్షయవ్యాధి గ్రస్తులకు పౌష్టికాహార కిట్లను మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు సోమవారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ క్షయవ్యాధి గ్రస్తులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని చెప్పారు. అలాగే వైద్యశాల అధికారులు ఇచ్చే టీబీ మందులను క్రమంతప్పకుండా ఉపయోగిస్తే వ్యాధి పూర్తిగా నయం అవుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఆత్మకూరు టీబీ యూనిట్ సూపర్‌వైజర్ రవికుమార్, మస్తానయ్య, సౌజన్య, వైద్య సిబ్బంది బాబు తదితరులు పాల్గొన్నారు.

మల్లన్నకు సహస్రదీపార్చన సేవ


పూజలు నిర్వహిస్తున్న ఈఓ దంపతులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో శ్రీభ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్లకు సోమవారం దేవస్థానం ఆధ్వర్యంలో సహస్రదీపార్చన సేవను ఈఓ ఎస్‌లవన్న దంపతులు, అర్చకులు నిర్వహించారు. ముందుగా దేవాలయ ప్రాంగణంలోని పురాతనమండపంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు అర్చకులు సహస్రదీపార్చన పూజలు జరిపించారు. ఈ సేవలో భాగంగా మండపంలో వెయ్యి దీపాలను వెలిగించి, ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు.

పశువులకు టీకాలు వేయించడంలో నిర్లక్ష్యం వద్దు


ఎద్దుకు టీకా వేస్తున్న డాక్టర్ భాస్కర్

పాములపాడు: పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించడంలో పాడి రైతులు నిర్లక్ష్యం చేయవద్దని పశువైద్యాధికారి భాస్కర్ అన్నారు. సోమవారం మండలంలోని తుమ్మలూరు గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. వ్యాధి లక్షణాల గురించి రైతులకు వివరించారు. ఎండాకాలం ఉదయం 10 గంటల లోపు, సాయంత్రం వేళల్లో మాత్రమే పశువులను మేపుతూ చల్లని నీరు తాగించాలని తెలిపారు. 60 ఎద్దులు, 160 గేదెలు, 60 దూడలకు టీకాలు వేశారు. ఏహెచ్ఏ మధు, గోపాలమిత్ర మున్వర్ బాషా పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

మిడుతూరు: క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక ధృఢత్వం లభిస్తుందని జెడ్పీటీసీ సభ్యుడు పర్వత యుగంధర్‌రెడ్డి , సహకార సొసైటీ అధ్యక్షుడు నాగతులసిరెడ్డి అన్నారు. సోమవారం మండలపరిధిలోని చింతలపల్లి గ్రామంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను అట్టహాసంగా ప్రారంభించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు నబీరసూల్, ఎంపీటీసీ సభ్యుడు నాగేశ్వరరెడ్డి, నాయకులు మల్లు శివనాగిరెడ్డి, తువ్వా లోకేశ్వరరెడ్డి, శేషిరెడ్డి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పురాతన ఆచారానికే ప్రాధాన్యం

- పాదయాత్ర సంప్రదాయాన్ని కొనసాగిస్తున్న కర్ణాటక, మహారాష్ట్ర భక్తులు
- భ్రమరాంబాదేవికి సారెతో వందల కిలోమీటర్లు కాలినడకన శ్రీశైలానికి
- రథోత్సవం తరువాతనే తిరుగుప్రయాణం


కావడితో కాలినడకన వెళ్తున్న భక్తులు


నాగలూటి వద్ద రొట్టెలు తయారు చేస్తున్న మహిళలు

ఆత్మకూరు: ఉగాది ఉత్సవాలను పురస్కరించుకొని శ్రీశైలక్షేత్రం మరో కర్ణాటకను తలపిస్తోంది. కన్నడిగులు శ్రీభ్రమరాంబాదేవిని ఆడపడుచుగా, ఇలవేల్పుగా మల్లికార్జునస్వామివారిని భావించి ఉగాది పర్వదినాన వారిని దర్శించు కునేందుకు వందలాది కిలో మీటర్లలో పాదయాత్ర చేపట్టి శ్రీశైలక్షేత్రం చేరుకోవడం ఆనవాయితీ. ప్రాదయాత్ర ప్రారంభం మొదలు తిరిగి గ్రామాలకు చేరుకునే వరకూ కర్ణాటక, మహారాష్ట్ర భక్తులు అనాదిగా వస్తున్న తమ పురాతన ఆచారాలకే అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారు.

వాహనాలు అందుబాటులో ఉన్నా పాదయాత్రకే ప్రాధాన్యత

గతంలో రవాణా మార్గం లేని రోజుల్లో కేవలం ఎక్కడికి వెళ్లాలన్నా కాలినడకనే వెళ్లేవారు. కన్నడిగులు తమ ఆడపడుచుగా భావించే భ్రమరాంబాదేవిని దర్శించుకుని, సారెను సమర్పించేందుకు సైతం కొన్ని శతాబ్దాల క్రితం నుంచి పాదయాత్రగా శ్రీశైలానికి చేరుకునేవారు. ప్రస్తుతం వాహనాలు వచ్చినా, కాలం మారినా కన్నడిగులు మాత్రం నేటికీ పాదయాత్రగానే శ్రీశైలం చేరుకునే ఆచారానికే అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారు. మండుటెండలు, కాళ్లకు బొబ్బలెక్కినా, పగుళ్లొచ్చినా, నడవలేక పోతున్నా ఎలాగైనా శ్రీశైలక్షేత్రమే లక్ష్యంగా వందల కిలోమీటర్ల దూరాన్ని సైతం లెక్కచేయకుండా శ్రీశైలక్షే క్షేత్రాన్ని చేరుకుంటున్నారు. దాదాపు నెల రోజుల ముందు ఇంటి నుంచి బయలు దేరి రోజుకు 40, 50 కిలోమీటర్ల దూరం నడకసాగించి ఉగాది పర్వదినం కంటే 3, 4 రోజులు ముందుగానే క్షేత్రానికి చేరుకుంటారు.

రథోత్సవం ముగిసే వరకూ శ్రీగిరిలోనే..

శ్రీశైల క్షేత్రానికి చేరుకున్న భక్తులు ఉగాది పర్వదినం సందర్భంగా రథోత్సవం ముగిసే వరకూ ఎన్నిరోజులైనా ఇక్కడే ఉండి రథోత్సవం ముగిసిన వెంటనే తిరిగి తమ స్వగ్రామాలకే వెళ్తారే తప్పా అంతకు మందే క్షేత్రాన్ని విడిచి వెళ్లరు.

ఆడపడుచుకు పుట్టింటి సారె

ఇంటి ఆడపడుచుకు ముత్తైదువు సౌభాగ్యంగా పసుపు, కుంకుమ, పట్టుచీర, గాజులు, మంగళ సూత్రాలు (25 గ్రాముల బంగారంతో), 6 గ్రాముల బంగారం తెలుపు రంగు వజ్రపురాయి పొదగబడిన ముక్కుపుడకతో అమ్మవారికి సారె, మల్లికార్జునస్వామికి కొబ్బరి, కలకండ, కర్పూరం, బెల్లం సమర్పిస్తారు. దీనికి ముందుగా పాతాళగంగలో పుణ్యస్నానాలాచరించి ఢమరుకనాదంతో ఆలయ ప్రవేశం చేసి అమ్మవారికి సారెను సమర్పించి ఆశీస్సులు తీసుకుంటారు. అమ్మవారు తమపై అనుగ్రహం ఉండాలంటే సారెగా సమర్పించిన పువ్వులు అమ్మవారి విగ్రహం నుంచి కింద పడేంత వరకు ఢమరుక నాదాలతో వేడుకుంటారు. పుష్పం కింద పడగానే అమ్మవారి అనుగ్రహం తమపై ఉందని భావించి సంబరపడతారు.

ఇంట్లో అఖండదీపం వెలిగించి నడక ప్రారంభం

కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల నుంచి వచ్చే పాదయాత్ర భక్తులు తమ ఇంటి వద్ద శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామి వార్లను తమ ఇంట్లో పూజించి, అఖండదీపం వెలిగించి పాదయాత్ర ప్రారంభిస్తారు. కాలినడక ప్రారంభసమయంలో వీరు తమ ఇళ్ల వద్ద నుంచే కంబికావళ్ల, నందికోలు, కర్రలతో, పల్లకి మోసుకుంటూ బయల్దేరుతారు.

నాగలూటి వీరభద్రస్వామే రక్షకుడు

నాగలూటి వీరభద్రస్వామిని రక్షకుడిగా భావిస్తూ దాదాపు నెల రోజుల పాటు ఇంటిని వదిలివస్తారు. పాదయాత్ర సమయంలో నాగలూటి వీరభద్ర స్వామిని దర్శించి మొదటి మొక్కు ఆయనకే చెల్లిస్తారు. అనంతరం మెట్ల మార్గం వద్ద కొబ్బరికాయలు సమర్పించి శ్రీశైలమల్లన్న దర్శనానికి బయల్దేరుతారు.

రొట్టెలు అంటే భలే ఇష్టం

కర్ణాటక భక్తులకు రొట్టెలు అంటే భలే ప్రీతి. రొట్టెలనే ఆహారంగా తీసుకుని పాదయాత్ర చేస్తుంటారు. శ్రీశైలక్షేత్రం వరకు ప్రతిచోటా అన్నదాన కార్యక్రమాలు కొనసాగుతున్నప్పటికీ తమ రొట్టె తిన్న తరువాతనే ఇతర చోట్ల అన్నదాన కార్యక్రమంలో పాల్గొంటారు.

వెదురు కర్రలంటే మక్కువ

ఉగాది పర్వదినం సందర్భంగా శ్రీశైలక్షేత్రానికి తరలివచ్చే కన్నడ భక్తులు స్వామిఅమ్మవార్ల దర్శనం అనంతరం నల్లమలలో దొరికే వెదురుకర్రలంటే చాలా ఇష్టపడతారు. వెదురు కర్రలు, చాటలు ఇలా కొనుగోలు చేసి తీసుకుని వెళ్లడం ఒక ఆచారంగా భావిస్తున్నారు.

పాదయాత్రగా వెళ్తేనే తృప్తి



కాలినడకన శ్రీశైలక్షేత్రానికి వెళ్లడమే మాకెంతో ఇష్టం. మా పెద్దలు ఇలాగేవెళ్లారు. 14 సంవత్సరాలుగా పాదయాత్రగా శ్రీశైలం వెళ్తున్నాను. మా ఊరు నుంచి శ్రీశైలానికి 650 కిలోమీటర్ల దూరం ఉంది. 16 రోజులుగా నడుచుకుంటూ ఆత్మకూరు చేరుకున్నాం. శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్లను పాదయాత్రగా వెళ్లి దర్శించుకుంటేనే సంతృప్తి వాహనాల్లో వెళ్తే ఎలాంటి తృప్తి ఉండదు.

– ధనుంజయ, జాంఖండ్, బాగల్‌కోట్ జిల్లా

పండుగలా భావిస్తాం



ఉగాది వస్తుందంటేనే నెల రోజుల ముందు నుంచే అన్ని సర్దుకుని శ్రీశైలానికి ప్రయాణం సాగిస్తాం. ఆహారానికి కొదవలేకుండా రొట్టెలు, పిండి తీసుకుని నడక సాగిస్తాం. పూర్వం గుర్రాలపై సామగ్రి తీసుకుని వెళ్లేవాళ్లాం. ఉగాది రోజున శ్రీభ్రమరాంబాదేవిని దర్శిస్తే మాకు ఎంతో సంతోషం. అమ్మవారిని చూసిన క్షణం మా ఆడపిల్లను చూసినంత ఆనందం. అమ్మవారికి మొక్కులు చెల్లిస్తాం.

– పార్వతి , చిక్‌మంగళూరు

విద్యార్థి కుటుంబానికి ఆర్థిక సాయం

పగిడ్యాల: అనారోగ్యంతో మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి పాఠశాల సిబ్బంది సోమవారం రూ. 5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. స్థానిక సీఎస్ఐ కాలనికి చెందిన సురేష్ కుమారుడు సన్నీ(12) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. కొద్ది రోజులుగా అనారోగ్యానికి గురికాగా తల్లిదండ్రులు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. అయితే కోలుకోలేక తెల్లవారుజామున మృతి చెందాడు. ఎంఈఓ సుభాన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధుసూదన్‌రావు, ఉపాధ్యాయులు చిన్నారి పార్థీవ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుని తల్లిదండ్రులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపి అంత్యక్రియల నిమిత్తం రూ.5 వేలు అందజేశారు. గ్రామ సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న, సహకార సొసైటీ డైరెక్టర్ కమలమ్మ, ఎంపీటీసీలు మిద్దె స్వాములు, పగడం గోపాల్, మాజీ ఎంపీటీసీ భాస్కర్ పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

మహానంది: విద్యార్థుల విద్యాభివృద్ధితో పాటు వారు క్రీడల్లో రాణించాలని జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి అన్నారు. మహానందిలోని గిరిజన ఆశ్రమపాఠశాలలో చదువుతున్న క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఆయన రూ.పదివేల విలువ చేసే క్రీడా సామగ్రిని పాఠశాల ప్రిన్సిపాల్ అంబమ్మ ఆధ్వర్యంలో సోమవారం అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు భీమవరం నాగేశ్వరరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పల్లకీలో మహానందీశుడి విహారం

మహానంది: మహానందిలో స్వయంభువుగా వెలిసిన శ్రీ మహానందీశ్వరుడి దంపతులు సోమవారం రాత్రి పల్లకీలో విహరించారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, అర్చకులు శరభయ్య, హరికుమారశర్మలు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులతో పాటు గోమాతను విశేషంగా అలంకరించారు. స్థానిక అలంకార మండపంలో శాస్త్రోక్త పూజల అనంతరం ఆలయ ప్రాకారాల్లో పల్లకి ఉత్సవాన్ని వైభవంగా చేపట్టారు.

క్యూలైన్ల వెంట షామియానాల ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్

మహానంది: మహానందీశ్వరుడి దర్శనార్థం వచ్చే భక్తులకు వేసవి తాపం నుంచి ఉపశమనం కలిగిస్తూ నీడను కల్పించేలా ఆలయ అధికారులు షామియానాలు ఏర్పాటు చేశారు. సాక్షి దినపత్రికలో సోమవారం ''మహానందీశా...కష్టాలు కనవయ్యా'' శీర్షికన ప్రచురించిన కథనానికి ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి స్పందించారు. ఈ మేరకు సోమవారం షామియానాలు తెప్పించి ఆలయంలోని రూ.150, రూ. 30 క్యూలైన్ల వెంట భక్తులకు నీడను కల్పిస్తూ ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ఉగాది ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చూస్తామన్నారు. ఇదిలా ఉండగా సాక్షిలో వచ్చిన కథనానికి జిల్లా కలెక్టర్ కార్యాలయాధికారులు సైతం స్పందించినట్లు తెలిసింది. ఈ మేరకు సంజాయిషీ కోరుతూ కలెక్టరేట్ నుంచి లేఖ పంపినట్లు ఆలయ వర్గాలు తెలిపాయి.


ఆలయంలో క్యూలైన్ల వెంట షామియానాలు వేసిన దృశ్యం

అక్రమంగా విద్యుత్ కనెక్షన్ తీసుకుంటే చర్యలు


గువ్వలకుంట్ల గ్రామంలో విద్యుత్ మీటర్‌ను పరిశీలిస్తున్న అధికారులు

కొత్తపల్లి: గ్రామాలలో అక్రమంగా విద్యుత్ కనెక్షన్లు తీసుకొని విద్యుత్ వాడుకుంటే చర్యలు తీసుకుంటామని నందికొట్కూరు విద్యుత్‌శాఖ ఏడీ భగవాన్ దాస్ హెచ్చరించారు. సోమవారం మండలంలోని గువ్వలకుంట్ల, బండినాయిని పాలెం గ్రామాలలో అక్రమ విద్యుత్ కనెక్షన్‌లపై తనిఖీ చేశారు. గ్రామాలలో వీధివీధి తిరిగి ఎవ్వరెవరు మెయిన్ లైన్లకు అక్రమంగా విద్యుత్ కనెక్షన్‌లు తీసుకున్నారో పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాలలో చాల మంది మీటర్లు ఉన్నా అక్రమంగా విద్యుత్ కనెక్షన్‌లు తగిలించుకొని చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నారన్నారు. 15 మంది అక్రమంగా విద్యుత్ కనెక్షన్లు చేసుకున్నట్లు గుర్తించామన్నారు. వారిపై పోలీసు కేసులతో సహా, విద్యుత్ శాఖపరిధిలో జరిమానాలు విధిస్తామని చెప్పారు. అనంతరం విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయం తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఆత్మకూరు టౌన్ ఏఈ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తల అరెస్టు సరికాదు

ఆత్మకూరు: అంగన్‌వాడీ కార్యకర్తలు, సీఐటీయూ నాయకులను అక్రమంగా అరెస్ట్ చేయడం సరికాదని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు, సీఐటీయూ నాయకులు వెంకటలక్ష్మీ , లక్ష్మీదేవి, ప్రమీళ, రణధీర్ అన్నారు. పట్టణంలోని కొత్తబస్టాండ్ వద్ద సోమవారం ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్లు తమకు వేతనాలు పెంచాలని, పనిభారం తగ్గించాలని కోరుతూ ఆందోళన నిర్వహించేందుకు విజయవాడకు వెళ్తే వారిని అడ్డుకుని అక్రమంగా అరెస్ట్ చేయడం తగదన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ నాయకులు, సీఐటీయూ నాయకులు విజయలక్ష్మీ, చంద్రకళ, అరుణ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

వెలుగోడు/ కొత్తపల్లి: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం వెలుగోడు, కొత్తపల్లి తహసీల్దార్ కార్యాలయాల ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. సీఐటీయూ వెలుగోడు మండల కార్యదర్శి తాళ్ల శ్రీనివాసులు, అధ్యక్షుడు నాగమోహన్, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ కొత్తపల్లి మండల నాయకురాల్లు శ్రీదేవి, నాగమణి, మంజులమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉగాది క్యాలెండర్ ఆవిష్కరణ

కొత్తపల్లి: మండల పరిధిలోని నందికుంట గ్రామ సమీపంలో వెలసిన శ్రీ విశ్వమాత దేవస్థానంలో సోమవారం తెలుగు నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్ఎస్ఎస్ జిల్లా కార్యదర్శి రఘురాములు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ తెలుగువారందరూ తెలుగు సంవత్సరాది క్యాలెండర్‌ను అనుసరించాలని కోరారు. కార్యక్రమంలో ముష్టపల్లె విశ్వరూపాచారి, మారం బానుమూరి, వాసుదేవరెడ్డి, సమరసత సేవా ఫౌండేషన్ మండల కన్వీనర్ రాజగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ వ్యాధిపై అవగాహన ఉండాలి

మిడుతూరు: ప్రతి ఒక్కరూ క్యాన్సర్ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలని డెంటిస్టు డాక్టర్ వీణ అన్నారు. సోమవారం స్థానిక సామాజిక ఆరోగ్యకేంద్రంలో ప్రపంచ ఓవర్ హెల్త్ డే సందర్భంగా నోటి కాన్సర్, జీర్ణకోశవ్యాధులు, తదితర జబ్బులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నోటి దుర్వాసన, జీర్ణకోశవ్యాధులు రావడానికి కారణాలు, సీజనల్ వ్యాధులు, దీర్ఘకాలిక వ్యాధులపై అవగాహన ఉండాలన్నారు. మన ఆరోగ్యం మన చేతుల్లో ఉందన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్ర పాటించాలన్నారు. కార్యక్రమంలో చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ తిరుపతి, అనస్తీషియా డాక్టర్ శారద, స్టాఫ్‌నర్సులు పుష్పలత, ముర్తుజావలి తదితరులు పాల్గొన్నారు



ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సుగుణ

నంద్యాల నుంచి శ్రీశైలానికి బస్సులు

మహానంది: ఉగాది మహోత్సవాల సందర్భంగా నంద్యాల నుంచి శ్రీశైలం, మహానందికి 30 ఆర్టీసీ బస్సులు నడుపుతున్నట్లు నంద్యాల డిపో చీఫ్ ఇన్‌స్పెక్టర్ మద్దిలేటినాయుడు తెలిపారు. ఉగాది ఉత్సవాల సందర్భంగా మహానందిలో ఏర్పాట్లను పరిశీలించేందుకు సోమవారం ఆయన ఎస్‌టీఐ వెంకటేశ్వర్లు, అస్లాంబాషాలతో కలిసి వచ్చారు. ఆయన మాట్లాడుతూ మహానంది నుంచి రాయచూరుకు పది బస్సులు ఉంటాయన్నారు. అవసరమైతే బళ్లారికి సైతం బస్సులను ఏర్పాటు చేస్తామని చెప్పారు. కన్నడ భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్ పాయింట్ ఏర్పాటు చేసి కన్నడ బాషలో భక్తులకు అర్థమయ్యేలా వివరిస్తూ ఉంటామని వివరించారు.

పన్నులపై జరిమానా రద్దు

నందికొట్కూరు: పట్టణంలో అన్ని రకాల స్థలాలు, గోదాములు, ఇంటి పన్నులపై విధించిన జరిమానాను ప్రభుత్వం రద్దు చేసిందని మున్సిపల్ చైర్మన్ సుధాకరరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ జీఓ నెంబరు 34 ప్రకారం పన్నులపై జరిమానాను రద్దు చేశారన్నారు. ప్రభుత్వం కల్పించిన వెసులుబాటును సద్వినియోగం చేసుకొని ఈ నెలాఖరులోపు బకాయిలు ఉన్న ప్రతి ఒక్కరూ త్వరగా చెల్లించాలని సూచించారు. లేనిపక్షంలో జరిమానా విధించడం తప్పదన్నారు.

23న జిల్లా స్థాయి పొట్టేళ్ల పోటీలు

మిడుతూరు: మండలపరిధిలోని పైపాలెం గ్రామంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని 23వ తేది గురువారం 8 గంటలకు జిల్లా స్థాయి పొట్టేళ్ల పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు తెలిపారు. ఈ పోటీల్లో విజేతలైన పొట్టేళ్ల యజమానులకు మొదటి, రెండో, మూడో బహుమతులు వరుసగా రూ. 10, 000, రూ. 6000, రూ. 4000 నగదును అందజేయనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఆసక్తి కల వారు రూ. 300 ఎంట్రీ ఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 90003 75654, 95504 94675, 96668 76505 సెల్‌ఫోన్‌లో సంప్రదించాలన్నారు.

'స్పందన'ను సద్వినియోగం చేసుకోండి

జూపాడుబంగ్లా: ప్రతి సోమవారం మండల కేంద్రంలో నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ పుల్లయ్యయాదవ్ సూచించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వ్యయ, ప్రయాసలకోర్చి నంద్యాల్లో జరిగే స్పందన కార్యక్రమానికి వెళ్లకుండా స్థానికంగానే ప్రజలు లిఖితపూర్వకంగా వారి సమస్యలను తెలియజేసి పరిష్కరించుకోవచ్చునని తెలిపారు.

'స్పందన'కు అధికారులు డుమ్మా

కొత్తపల్లి: మండలంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమానికి అధికారులు డుమ్మాకొట్టారు. ఒకరిద్దరు తప్ప ఏ అధికారి కార్యక్రమంలో పాల్గొనక పోవడంపై కార్యాలయానికి వచ్చిన ప్రజల నుంచి విమర్శలు వెలువెత్తున్నాయి. 11 గంటలు దాటిన అధికారులు స్పందన రాకపోడం పై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు లేని స్పందన కార్యక్రమం ఎందుకని ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.

ఉగాది ఉత్సవ ఏర్పాట్ల పరిశీలన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో ఉగాది మహోత్సవాలను పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం దేవస్థానం చేసిన వివిధ ఏర్పాట్లను సోమవారం ఈఓ ఎస్ లవన్న పరిశీలించారు. ఇందులో భాగంగా యాంఫిథియోటర్, మల్లమ్మ కన్నీరు, పలు ఉద్యానవనాలు, పార్కింగ్ ప్రదేశాలు, దేవస్థానం ఏర్పాటు చేసిన సమాచార కేంద్రాన్ని సందర్శించారు. ఈఓ మాట్లాడుతూ క్యూ కాంప్లెక్స్, క్యూలైన్లు, శివదీక్షా శిబిరాలు, అన్నదాన ప్రదేశాలలో సుమారు 3 లక్షల వాటర్‌ప్యాకెట్లను అందజేస్తున్నట్లు తెలిపారు. మరో 2 లక్షల మంచినీటి ప్యాకెట్లను కూడా సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. క్షేత్ర పరిధిలో భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్న నిర్వాహకులకు దేవస్థానం అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తుండాలని సూచించారు. దేవస్థానం అందిస్తున్న సౌకర్యాలపై పలువురు భక్తుల అభిప్రాయాలను ఈఓ తెలుసుకున్నారు. ఉగాది మహోత్సవాలకు వచ్చిన కన్నడ భక్తుల సౌకర్యార్థం సిద్ధరామప్ప వాణిజ్య సముదాయం, మల్లమ్మ కన్నీరు, వైద్యశాల, కల్యాణకట్ట, పాతాళగంగ మెట్ల వద్ద తదితర పది చోట్ల సమాచార కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఈఓ వివరించారు.


సౌకర్యాలపై భక్తులతో ఆరా తీస్తున్న ఈఓ లవన్న

మహిళ అనుమానాస్పద మృతి

కొత్తపల్లి: మండలంలోని ఎర్రమఠం గ్రామపంచాయతీ మజరా గ్రామమైన బలపాలతిప్ప గ్రామంలో ఓ గిరిజన మహిళ అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. బలపాలతిప్ప గూడెంకు చెందిన నిమ్మల లింగమ్మ (43), భర్త ఈదన్నలు పక్కనే ఉన్న కృష్ణానదిలో చేపలవేట చేస్తూ జీవనం సాగిస్తుండే వారు. చేపలవేటకు వెళ్లిన వీరు నది అవతలి వైపు తెలంగాణ రాష్ట్రంలోని సోమశిల గ్రామం నుంచి ఆదివారం ఓ కల్లు దుకాణంలో కల్లు తెచ్చుకున్నారు. రాత్రి ఇంటి వద్ద లింగమ్మ ఆ కల్లు సేవించి నిద్రించింది. సోమవారం తెల్లవారినా లేవలేదు. దీంతో భర్త ఈదన్న ఎన్నిసార్లు పిలిచినా పలకలేదు. అప్పటికే లింగమ్మ(43) మరణించిన విషయాన్ని గ్రహించారు. గ్రామ రెవెన్యూ సహాయకుడి ద్వారా పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కాగా కుటుంబ సభ్యులు లింగమ్మ చాలా కాలం క్రితం నుంచి ఆయాసంతో బాధపడుతుందని తెలిపారు. లింగమ్మ కల్లు తాగి చనిపోయిందా లేక అనారోగ్యంతో చనిపోయిందా అన్న విషయం పోస్టుమార్టంలో తెలియాల్సి ఉంది. మృతురాలి కుమారుడు బాలస్వామి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


లింగమ్మ (ఫైల్)

స్వచ్ఛ అవార్డులకు దరఖాస్తు చేసుకోండి

నందికొట్కూరు: స్వచ్ఛ అవార్డులకు దరఖాస్తులు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కిశోర్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పారిశుద్ధ్యం , ఘన, వ్యర్థాల నిర్వహణలో ప్రతిభ చూపిన మహిళలు ఉమెన్ ఐకాన్స్ లీడింగ్ స్వచ్ఛత అవార్డులు పొందేందుకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. మరుగుదొడ్ల నిర్వహణ, తాగునీటి శుద్ధి పద్ధతులు, తడి, పొడి చెత్త నుంచి సంపద తయారీ, స్వచ్ఛతపై అవగాహన, నూతన ఆవిష్కరణల విభాగాల్లో కృషి చేస్తున్న మహిళలు అవార్డులకు అర్హులన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 22వ తేదీ లోపు పట్టణంలోని అన్ని సచివాలయాల్లో దరఖాస్తు అందజేయవచ్చన్నారు.

'దేశ సంపదను అదానికి దోచి పెట్టిన ప్రధాని'

నందికొట్కూరు: దేశ సంపదను అదానికి దేశ ప్రధాని నరేంద్ర మోదీ దోచి పెడుతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్ ధ్వజమెత్తారు. సోమవారం పట్టణంలోని జై కిసాన్ పార్కులో ఏర్పాటు చేసిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అదాని ఆస్తులు రూ. 56వేల కోట్ల నుంచి రూ.16లక్షల కోట్లకు ఎలా పెరిగాయని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, పక్కిర్‌సాహెబ్, నాగమణి పాల్గొన్నారు.

కురుకుందలో నూతన బోరు

ఆత్మకూరు: మండలంలోని కురుకుంద గ్రామంలో వేసవిని దృష్టిలో ఉంచుకుని మంచినీటి ఎద్దడి నివారణ కోసం నూతన బోరును సోమవారం ప్రారంభించారు. డీఎల్‌పీఓ కవిత మాట్లాడుతూ గ్రామంలోని బీసీ, ఎస్సీ కాలనీల్లో ప్రతి ఏటా వేసవిలో నీటి ఎద్దడి ఏర్పడేదన్నారు. ఈ ఏడాది కూడా నీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉన్నందున కొత్త బోరు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పంచాయతీ కార్యదర్శి లక్ష్మీ రత్నమ్మ, సర్పంచ్ మహబూబ్‌బీ, బండెల మాబు పాల్గొన్నారు.


బోరును పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ కవిత

శ్రీశైలంలో తూనికలు, కొలతల శాఖ అధికారుల దాడులు

శ్రీశైలం: ఉగాది ఉత్సవాల సందర్భంగా సోమవారం సాయంత్రం తూనికలు, కొలతలు శాఖ అధికారులు శ్రీశైలంలోని 47 షాపులపై మెరుపుదాడి చేశారు. వాటర్ బాటిళ్లు అధిక ధరలకు విక్రయించడం, లేబుల్స్ లేకపోవడం, ఎమ్మార్పీ కంటే ఎక్కువకు వస్తువులు అమ్ముతున్నట్లు గుర్తించి 21 షాపులకు సుమారు రూ.45 వేల జరిమానా విధించారు. గతేదాది అధిక ధరల సమస్య కారణంతో లా అండ్ ఆర్డర్ సమస్య ఏర్పడడంతో ముందస్తు చర్యల్లో భాగంగా జిల్లా ఎస్పీ మేరకు దాడులు నిర్వహించారు. ఉగాది ఉత్సవాల ముగిసేంత వరకు ప్రతి రోజూ షాపులను తనిఖీ చేస్తామని తూనికలు, కొలతలు శాఖ ఇన్‌స్పెక్టర్ అనిత తెలిపారు. సిబ్బంది షషాంత్, ప్రకాష్, ఎస్సైలు శ్రీనివాసులు, హరిప్రసాద్, పోలీసులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

పాములపాడు: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయుర్వేద వైద్యాధికారిణి లావణ్య అన్నారు. సోమవారం స్థానిక ఉర్దూ ప్రాథమిక పాఠ శాలలో ఆయుర్వేద ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. పలు వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. వ్యాధి నిరోధక శక్తిని పెంచే ఔషధములను విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్ర మంలో హెచ్ఎం నిజాముద్దిన్, సిబ్బంది పాల్గొన్నారు.